క్లుప్తంగా

అనుమతులు రద్దు చేయాలి



వెంకటాపురం(కె): నిబంధనలు పాటించని ఇసుక రీచ్‌ల అనుమతులను రద్దు చేయాలని ఆదివాసీ ఐఖ్య సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ఆదివాసీ ఐఖ్య సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ ఐఖ్య సంఘాల నాయకులు పూనెం రామ్‌చందర్ మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అధికారులు అమలు చేయటం లేదని ఆరోపించారు. మండలంలో అక్రమంగా మోరం తవ్వకాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవటం లేదని అన్నారు. ఇప్పటికైన అధికారులు నిబంధనలు పాటించని ఇసుక రీచ్‌లపై చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఐఖ్య సంఘాల నాయకులు పర్షిక సతీష్, పూనెం సాయి, మడకం చిట్టిబాబు, సిద్దిబోయిన సర్వేశ్వరావు, చింత సోమరాజు తదితరులు ఉన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో బుధవారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర భూపాలపల్లి బ్రాంచ్‌ని కలెక్టర్ భవేష్ మిశ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హైదరాబాద్ డిప్యూటీ జోనల్ మేనేజర్ మహ్మద్ షాజీబ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హైదరాబాద్ జోన్‌లోని జిల్లా కేంద్రంలో 52వ బ్రాంచ్‌ని ప్రారంభించుకున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. దీంతో రాష్ట్రంలో 25 జిల్లాలలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఏర్పడిందని దేశవ్యాప్తంగా 2,300 బ్రాంచ్‌లు ఏర్పాటు అయ్యాయన్నారు. రిటైలర్స్‌కి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తుందని 3 ఈఎంఐలు ఉచితంగా సులభమైన ప్రాసెసింగ్‌తో ఇంటి రుణాలు, బంగారు రుణాలు తక్కువ వడ్డీతో ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం తిరుపతి, బీడీఓ అశోక్ కుమార్, భూపాలపల్లి బ్రాంచ్ మేనేజర్ బి రాజ్‌ప్రసాద్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



భూపాలపల్లి అర్బన్: రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం బహుమతులను అందజేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై మంగళవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ మేరకు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మండలంలోని గొల్లబుద్దారం ఉన్నత పాఠశాలకు చెందిన ఎం సిరి, సీహెచ్ వైష్ణవికి రూ.5వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన భూపాలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన అఖిల, హాసినిలకు రూ.4వేలు, పెద్దాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన సాహిత్య, శ్రావణి తృతీయ స్థానంలో నిలవగా రూ.3వేల చొప్పున నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం తిరుపతి, ఎంఈఓ దేవనాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

కాటారం: విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఉపాధ్యాయులకు సూచించారు. కాటారం మండలంలోని చిద్నెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సంఖ్య, విద్యాబోధన తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సౌకర్యాలు, శిథిలావస్థకు చేరుకొని నిరుపయోగంగా మారిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహించాల్సి వస్తుందని ప్రధానోపాధ్యాయులు సురేశ్ ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎంపీపీ భవన మ రమ్మతులకు మండల పరిషత్ ద్వారా రూ.2లక్షల ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, నాయకులు కుమ్మరి అశోక్, గడ్డం కొంరయ్య ఉన్నారు.

పత్తిగింజలు నాటుతున్న కూలీలు



వరి నారుకోసం విత్తనాలు చల్లుతున్న రైతు



ముమ్మరంగా వ్యవసాయ పనులు

మంగపేట: మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు పడటంతో రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు. బోరు బావుల కింద, జీవనదిలో పారే రాజుపేట ముసలమ్మవాగు, మంగపేటగౌరారంవాగు నీటిపై వరి సాగు సాగయ్యే భూముల రైతులు నార్లు పోసి దుక్కులు సిద్ధం చేస్తున్నారు. చెరువులు, కుంటలు, వర్షాదారంపై సాగయ్యే భూముల రైతులు ప్రస్తుతం నార్లు పోస్తున్నారు. పత్తిసాగు చేసే రైతులు పత్తి గింజలు నాటుతున్నారు. కోమటిపల్లి, చెరుపల్లి, నర్సింహాసాగర్, పూరేడుపల్లి, మల్లూరు, తిమ్మంపేట, రాజుపేట తదితర గ్రామాల్లో మిర్చి సాగు చేసేందుకు ట్రాక్టర్లతో దుక్కులు దున్నుతున్నారు. ఈ ఏడాది రైతులు మిర్చీ దిగుబడి రావడంతో మార్కెట్‌లో మద్దతు ధర పలకండతో రైతులకు మిర్చి సాగుపై ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. దీంతో మండలంలో మిర్చి సాగు చేసే నల్లరేగడి భూములకు ఎకరం కౌలు ధర రూ.లక్ష వరకు పలుకుతుంది.



పత్తిగింజలు నాటేందుకు అచ్చు కొడుతున్న రైతులు



ట్రాక్టరుతో పొలం దున్నుతున్న రైతు



బోరుబావుల కింద నారు మడులు

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీదేవిసుధీర్‌యాదవ్

ములుగు: బీఆర్‌ఎస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ గంద్రకోట శ్రీదేవిసుధీర్ యాదవ్ అన్నారు. బుధవారం ములుగు మండలంలోని రాయినిగూడెంలో సీసీ రోడ్డు పనులను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో ప్రజలకు అవసరమైన పనులను విజయవంతంగా చేపడుతున్నామని అన్నారు. అవసరమైన ప్రతిగ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మాసిపెద్ది పుష్పలతసత్యనారాయణ, సర్పంచ్ పిడబోయిన స్వామి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కల్తీ రంజిత్, వజ్జ రాజు, చేర్పుల రాజన్న, రామారావు, అప్పాజి అయిలయ్య, ముసిక మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీని ఏర్పాటు చేయాలని వినతి



సర్పంచ్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని అంకన్నగూడెం గ్రామ సమీపంలోని గుడి గుట్టల వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం అంకన్నగూడెం గ్రామస్తులు రామచంద్రాపురం సర్పంచ్ అట్టం సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంజనేయస్వామి ఆలయానికి ఆలయ కమిటీ లేక పోవటం వల్ల ఆలయ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని అన్నారు. ఆలయ నిర్వహణ కొన్ని సంవత్సరాలుగా ఒకే వ్యక్తి నిర్వస్తున్నాడని దానివల్ల సక్రమంగా లేకుండా పోయిందని భక్తులకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైన ఆలయానికి కమిటీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిటిబాబు, చందు, నర్సింహారావు, బుల్లయ్య తదితరులు ఉన్నారు.

చేయూత



బియ్యం అందజేస్తున్న దేవ్‌సింగ్

ములుగు రూరల్: గోవిందరావుపేట మండలంలోని పస్రా పంచాయతీ పరిధి మొద్దులగూడెం గ్రామానికి చెందిన ఇస్లావత్ బుచ్చమ్మకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇటీవల దగ్ధమైంది. దీంతో నిరాశ్రయులుగా మారిన కుటుంబానికి రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ భూక్యా దేవ్‌సింగ్ 25 కేజీల బియ్యంతో పాటు, దుస్తువులు, దుప్పట్లు అందించారు. అదే గ్రామానికి చెందిన భూక్యా పాపాయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట దొంతి విజేందర్‌రెడ్డి, శ్రీకాంత్, రమేష్, రాజు, గణేష్, తేజ, అరవింద్, వంశీ, ఆనంద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇప్పించాలి

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రం సమీపంలోని కామారం గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు ఇప్పించాలని గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఆదివాసీల పెద్దమనుషుల సమక్షంలో గ్రామంలోని సమస్యలపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏటూరునాగారం హైవే రోడ్డు నుంచి కామారం గ్రామానికి ఇటీవల బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా అటవీ శాఖ అధికారుల అభ్యంతరంతో పనులు నిలిచిపోయాయని వారు వివరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొర్నబెల్లి శేషగిరి, గ్రామ పెద్దలు పాయం హన్మంతరావు, పాక దయాకర్, రేగ లక్ష్మి, పాయం లక్ష్మి, నర్సమ్మ, కళావతి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందజేస్తున్న జీపీ కార్మికులు

మంగపేట: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు సీఐటీయూ మండల నాయకులు ఎల్పీ ముత్యాలు ఆధ్వర్యంలో 17 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీస్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ రమేష్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కారోబార్, సిబ్బంది సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చీకుర్తి కొమిరెల్లి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని పర్మనెంటు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. జీఓ 60 ప్రకారంగా కార్మికులు కనీస వేతనం చెల్లించాలని, అర్హత కలిగిన సిబ్బందికి పదోన్నతి కల్పించాలని న్యాయపరమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జులై 06 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కారోబార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన ఎండీ రియాజ్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సర్పంచ్ అహ్మద్‌పాషా బుధవారం పరామర్శించి రూ.2,500 ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట వార్డు సభ్యుడు దేవేందర్‌రెడ్డి, రాములు, గ్రామస్తులు సుధాకర్, రహీం, అక్రమ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ఏటూరునాగారం: యువత రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు, యువకులకు కాంగ్రెస్ పార్టీ మీకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. అలాగే ప్రతి ఒక్కరిని స్వేచ్ఛాయుతంగా కాంగ్రెస్ పార్టీ ఆహ్వానిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులను, అమరవీరుల కుటుంబాలను సీఎం కేసీఆర్ మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు లేక అల్లాడుతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసెంబ్లీ కోర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, ఎంపీటీసీ గుడ్ల శ్రీలతదేవేందర్, జిల్లా మైనారిటీ సీనియర్ నాయకులు ఖలీల్ ఖాన్, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, మహిళా మండల అధ్యక్షురాలు, ఉపసర్పంచ్ కర్ల అరుణ, అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, జిల్లా మహిళా నాయకురాలు కట్కూరి రాధిక, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, సరికొప్పుల శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిటమట రఘు

వాహనాల తనిఖీ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి 163 జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలను నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను సేకరించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఏఎస్ఐ సుబ్బారావు, సీఆర్‌పీఎఫ్, సివిల్ సిబ్బంది ఉన్నారు.



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

దాతలు దయ చూపండి..

- గొర్రెలు, గేదెలు అమ్మి డయాలసిస్
- కిడ్నీలు మార్చేందుకు రూ.30 లక్షలు అవసరం
- దాతల కోసం ఎదురుచూపు



ఆస్పత్రిలో ఉన్న అనుముల సమ్మయ్య

వాజేడు: మండల పరిధిలోని పేరూరుకు చెందిన అనుముల సమ్మయ్య గొర్రెలు కాసుకుని, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. కాగా, సంవత్సరం నుంచి సమ్మయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రికి వెళ్లి వైద్యపరీక్షలను చేయించుకోగా రెండు కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు తెలిపారు. కిడ్నీలు మార్చాలని.. లేదా డయాలసిస్ చేయాలని చెప్పారు. అంతకుముందే డెంగీ జ్వరంతో రూ.2 లక్షలను ఖర్చు చేసి వైద్యం చేయించుకున్నాడు. పరిస్థితి బాగాలేదని భావించి కూతురుకు పెళ్లి చేశాడు. ఇంతలోనే కిడ్నీలు దెబ్బతిన్నట్లు బయటపడింది. కిడ్నీలు మార్చుకునేంత డబ్బులు వారి వద్ద లేవు. దీంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. గతంలో నెలకు ఒకసారి రెండు సార్లు చేసే డయాలసిస్ ప్రస్తుతం వారానికి నాలుగు సార్లు చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా మారింది. డయాలసిస్ కోసం ఉన్న 50 గొర్రెలు, నాలుగు గేదెలను అమ్మేశాడు. మరో రూ.4 లక్షల వరకు వైద్యం నిమిత్తం అప్పులు చేశాడు. ఇప్పుడు డయాలసిస్ చేసినా ఉపయోగం లేని పరిస్థితికి వచ్చాడు. వైద్యులు కిడ్నీలను మార్చాలని చెప్పినట్లు సమ్మయ్య అతని భార్య సావిత్రి తెలిపారు. ఒక్కో కిడ్నీ మార్చడానికి సుమారుగా రూ.15 లక్షల దాకా(కొనడానికి, మార్చడానికి) ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపినట్లు వాపోయారు. కాగా, కిడ్నీలను మార్చుకోవడానికి చేతిలో డబ్బులు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. వైద్యం చేయించుకోవడానికి, ఒక్క కిడ్నీ నైనా మార్చు కోవడానికి దాతలు సహకరించాలని సమ్మయ్య, అతడి భార్య సావిత్రి వేడుకుంటున్నారు.

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్
మల్లికార్జున్(సమ్మయ్య కుమారుడు)
ఫోన్ పే, గూగుల్ పే
81212 40510

కొత్తమల్లూరులో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి యమున

మంగపేట: మండలంలోని బెస్తగూడెం(కొత్తమల్లూరులో) చుంచుపల్లి వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ముగ్గురు జ్వరపీడితుల నుంచి రక్తన మూనాలు సేకరించి మలేరియా పరీక్షలు నిర్వహించగా నెగిటీవ్‌గా వచ్చివందన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి వివరించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పాటించాల్సిన ఆరోగ్య జాగ్రతలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో పీహెచ్ఎస్ శైలజ, హెచ్‌వీ ముత్తమ్మ పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప బోనాల పండుగ

మంగపేట: మండలంలోని కమలాపురంలో కురుమలు బీరప్ప బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభంలో తొలి ఏకాదశికి ముందు ఆషాడమాసంలో బీరన్నకు బోనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం కుర్మ కులస్తుల ఆచారం. కమలాపురంలో మహిళలు అత్యంత భక్తి శ్రద్దలతో బీరన్నకు బోనం తయారు చేసి గుడికి వద్దకు వెళ్లి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండాలని, పాడి, పంటతో పాటు తమ పిల్లా పాలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. గొర్రె పొటేళ్లను బలిచ్చి బీరన్నకు మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలతో వెళ్తున్న కురుమ కులస్తులు

క్విజ్ పోటీలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మంగపేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆపార్టీ మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆపార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 01, 02, 03 తేదీల్లో నిర్వహించే ఈ పోటీలకు యువత అధిక సంఖ్యలో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 09 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిన మోసాన్ని ఆయన ఎండగట్టారు. రాష్ట్రంలో కుటుంబ పాలనతో మాటల గారడీతో ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్య, మండల నాయకులు యానయ్య, హరికృష్ణ, నగేష్, తిరుపతి, నర్సయ్య, ఆదినారాయణ, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్, సూపర్‌వైజర్

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని సర్పంచ్ దొడ్డ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అఫ్రీనాతో కలిసి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలన్నారు. ఇటీవల కోడిగుడ్లు పాడైపోవడంతో పలువురు లబ్ధిదారులు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సూపర్‌వైజర్‌తో కలిసి గుడ్లను పరిశీలించామన్నారు. సెంటర్ల వారిగా ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెడ్మాస్టర్ స్వర్ణలత, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.